క్లుప్తంగా

ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఎస్ఎస్‌తాడ్వాయి: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు సుతారి పాపారావు అన్నారు. శుక్రవారం ఆయన కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. ఉపాధ్యాయ, సామాజిక, విద్యారంగ సమస్యలపై మాట్లాడే ప్రజా గొంతుకను ఎమ్మెల్సీగా ఎన్నుకుని శాసనమండలికి పంపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయులు ప్రభాకర్, వెంకట్, కళాశాల అధ్యాపకులు జ్యోతి, నాగమణి, సుమలత, శైలజ సరిత, కృష్ణవేణి, సంధ్య, రవీంద్ర, రజిత, నాగమణి పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

టేకుమట్ల: డబ్బులు ఇవ్వాలంటూ వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై దాట్ల కుమారస్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని కోదూరి చంద్రయ్య వద్దకు బుధవారం రాత్రి వచ్చి మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వమని మండలంలోని దుబ్యాల గ్రామానికి చెందిన సంగి నరేష్ కోరగా, లేవని అనడంతో నానాబూతులు తిడుతూ కర్రతో దాడీ చేశాడు. కాగా బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితుడు సంగి నరేశ్ పాటు, చంద్రయ్యపై దాడి చేయడానికి సహకరించిన సంగి శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

కమిటీ ఎన్నిక

చిట్యాల: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ టౌన్ కమిటీని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశాల మేరకు గురువారం మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. టౌన్ అధ్యక్షుడిగా మైదం రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పుల్ల సమ్మయ్య, గౌరవ అధ్యక్షుడిగా శనిగరపు మొగిలి, ఉపాధ్యక్షులుగా ఆరెపల్లి నర్సింహారాములు, సహాయ కార్యదర్శిగా రామస్వామిని నియమించారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి



మల్లయ్య(ఫైల్)

ఏటూరునాగారం: అప్పుల బాధతో పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని రామన్నగూడెం బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై తాజొద్దీన్ కథనం ప్రకారం.. రామన్నగూడెం గ్రామానికి చెందిన రైతు చెన్నూరి మల్లయ్య(55) మిర్చి పంట దిగుబడి సరిగా రాక పెట్టిన పెట్టుబడి రాకపోవడంతో మనోవేదనకు గురయ్యేవాడు. అలాగే మూడేళ్ల క్రితం చిన్న కుమార్తె పెళ్లికి కూడా అప్పు చేశాడు. దీంతో అప్పుల బాధతో పొలంలో అక్టోబర్ 25న పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి పడిపోగ వెంటనే అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 30న రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. కుమారుడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు



ఎస్ఎస్ తాడ్వాయి: బాణసంచా కాలుస్తూ సంబరాలు



వాజేడులో..



ఎస్ఎస్ తాడ్వాయి: పూలతో అమ్మవార్ల గద్దెల అలంకరణ



ములుగు రూరల్: నోములు నోచుకుంటున్న కుటుంబ సభ్యులు



వెంకటాపురం(ఎం): బాణసంచా పేల్చుతున్న యువకుడు శ్రీరామ్‌రెడ్డి



వెంకటాపురం(ఎం)లో..

ములుగు రూరల్ : వెలుగులు విరజిమ్మే దీపావళి వేడుకలను జిల్లా వ్యాప్తంగా గురు, శుక్రవారం రెండ్రోజులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే జిల్లా కేంద్రంలోని రామాలయం, శివాలయం, గట్టమ్మ ఆలయం, షిర్డీ సాయినాథ ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. మహిళలు ఇంటి ఎదుట వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. బాణసంచా విక్రయ కేంద్రాల్లో ప్రజలు బారులుదీరారు. సాయంత్రం ఇళ్ల ఎదుట కుటుంబ సమేతంగా బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. రాత్రి వరకు పట్టణ, మండల, గ్రామాల్లో బాణసంచాల మోతతో పండుగ వాతావరణం కనిపించింది. ఇదిలా ఉండగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో నోములు నోచుకున్నారు. శనివారం నోములు ఎత్తుకోనున్నారు.

వాజేడు : మండల వ్యాప్తంగా దీపావళి పండుగను గురువారం జరుపుకున్నారు. వీధుల్లో బాణసంచా కాల్చి ఆనందంగా గడిపారు. ఇంటి ముంగిట దీపాలను వెలిగించారు.

ఎస్ఎస్‌తాడ్వాయి : దీపావళి వేడుకలను ప్రజలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఇంటి ముంగిళ్లు దీపకాంతులతో కళకళలాడాయి. ఇంటి గుమ్మాలను మామిడి ఆకుల తోరణాలతో, ముంగిళ్లను రంగువల్లులతో అందంగా తీర్చిదిద్దారు. టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. లక్ష్మీపూజ చేశారు. నోములకు వచ్చిన బంధువులతో ఇళ్లల్లో సందడి నెలకొంది. మేడారం సమ్మక్క–సారలమ్మ గద్దెలను దేవదాయశాఖ ఆధ్వర్యంలో పూలతో అందంగా అలంకరించారు. అమ్మవార్ల గద్దెల వద్ద పూజారులు ప్రమిదల్లో దీపాలను వెలగించారు. దీపకాంతులతో అమ్మవార్ల గద్దెల ప్రాంగణం కళకళలాడింది.

గోవిందరావుపేట : మండలంలోని మారుమూల ప్రాంతాల్లో వెలుగుల పండుగ దీపావళి వేడుకలు చేసుకున్నారు. బాణసంచా మెరుపులతో చిన్న, పెద్ద సందడి చేశారు. లక్ష్మి పూజ, మిఠాయిల పంపిణీతో ప్రజలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ కుటుంబ సభ్యులతో దీపావళి జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



ములుగు రూరల్: ఇంటి ఎదుట బాణసంచా కాలుస్తున్న కుటుంబ సభ్యులు

వెంకటాపురం(ఎం) : మండలంలో దీపావళి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ టపాసులు పేల్చుతూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వెంకటాపురం ఎస్సై సతీష్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో పోలీసు సిబ్బంది దీపావళి వేడుకలు నిర్వహించారు.



చల్వాయిలో దీపాలు వెలిగిస్తున్న చిన్నారులు



వెంకటాపురం(ఎం): దీపాలు వెలిగిస్తున్న యువతి



గోవిందరావుపేటలో..

సంక్షేమ పథకాలకు మారుపేరు ఇందిరాగాంధీ



ములుగు: ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ములుగు : సంక్షేమ పథకాలకు మారుపేరు ఇందిరాగాంధీ అని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి ఆధ్వర్యంలో గురువారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారతదేశ రాజకీయ చరిత్రలో అనేక సంక్షేమ పథకాలను అమలుచేసి ఆదర్శంగా నిలిచిన గొప్పవ్యక్తి ఇందిరాగాంధీ అని కొనియాడారు. అలాంటి వ్యక్తిని ప్రతి కార్యకర్త ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, ఉపాధ్యక్షుడు గందే శ్రీను, కిసాన్ కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి నూనేటి శ్యాం, అధికార ప్రతినిధి ఎండీ అహ్మద్‌పాషా, పీఏసీఎస్ చైర్మన్ చిక్కుల రాములు, మాజీ ఎంపీటీసీ ఇమ్మడి రాజుయాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ బోయిన రాజు, గుంటోజు పావని, జిల్లా మైనార్టీసెల్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కోఠ్బోద్దీన్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మట్టివాడ తిరుపతి, బోడ సతీష్, ఓరుగంటి అనిల్, కుక్కల నాగరాజు, మాదారపు రాజు, శంకర్, పత్తి రాజమౌళి, కొంరయ్య పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

టేకుమట్ల: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు పెరుమాండ్ల క్రాంతి ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం 20 సూత్రాల పథకాన్ని ప్రవేశ పెట్టిన మహోన్నత వ్యక్తి అని ఇందిరాగాంధీ అని కొనియాడారు. బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాంపెల్లి వీరేశం, సదానందం ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కాటారం : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్లా నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామీణ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడంలో ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా భావించి క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలని సూచించారు. టోర్నమెంట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన బొమ్మాపూర్, ద్వితీయ స్థానంలో నిలిచిన గంగారం జట్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తెలంగాణ వెంకటేశ్వరరావు, ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, ఎస్ఎఫ్ఐ నాయకులు సర్వన్, బొడ్డు కిశోర్, క్రీడాకారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మొగుళ్లపల్లి : మండలంలోని మెట్టుపల్లికి చెందిన యార ఐలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కుమారస్వామి, చిట్యాల ఏఎంసీ వైస్ చైర్మన్ రఫీ, నాయకులు తక్కళ్లపల్లి రాజు, నరహరి బక్కిరెడ్డి, ఎర్రబెల్లి పున్నంచందర్‌రావు, చిలుకూరి దేవేందర్‌రెడ్డి, మంద సుధాకర్, స్వామి, లక్ష్మణ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు



ఏఐటీయూసీ జెండా ఆవిష్కరిస్తున్న రవీందర్

ములుగు రూరల్ : ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలను జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కార్మికుల హక్కులు, సంక్షేమానికి ఏఐటీయూసీ నిరంతరం పని చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకు రావడం వల్ల కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయడం లేదని పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతనం చెల్లించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ముత్యాల రాజు, తనుగుల రాజు, నాగరాజు, రాజయ్య, రవి, రామన్న, రాంబాబు, రమేష్, భిక్షపతి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన సరుకులు అందిస్తాం..

ఎస్ఎస్‌తాడ్వాయి : నాణ్యమైన నిత్యావసరాలు అందించడమే ధ్యేయంగా మున్నూరు కాపు మాక్స్ మహిళా సంఘం ఏర్పడిందని సొసైటీ కార్యనిర్వహణ అధికారి పుట్టం పురుషోత్తమరావు తెలిపారు. మేడారంలో సమ్మక్క–సారలమ్మను సొసైటీ సభ్యులు శుక్రవారం దర్శించుకుని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేడారంలోని అతిథిగృహంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల మధుసూదన్ పటేల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సొసైటీ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సొసైటీ కార్యనిర్వాహణ అధికారి పురుషోత్తమరావు హాజరై మాట్లాడారు. మహిళా మాక్స్ సొసైటీ ద్వారా సహకార పద్ధతిలో కల్తీ లేని నిత్యావసరాలు అందించి వినియోగాదారులకు, రైతులకు న్యాయం చేస్తుందన్నారు. అనంతరం సంస్థ చైర్‌పర్సన్ ఏటిగడ్డ అరుణ పటేల్ మాట్లాడారు. మున్నూరు కాపు మహిళలు మాక్స్‌లో సభ్యులుగా చేరాలన్నారు. వినియోగిత సేవలు పొందడానికి సాధారణ సభ్యత్వము రూ.100 చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా 25 మంది జిల్లా డైరెక్టర్లతో పురుషోత్తంరావు ప్రమాణ స్వీకారం చేయించి వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నూతన డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సమగ్ర సర్వే ప్రారంభం



ములుగు రూరల్: సర్వే చేస్తున్న అధికారులు



ఏటూరునాగారం: సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ జగదీశ్



వాజేడు: స్టిక్కర్ వేస్తున్న అధికారులు

ములుగు రూరల్: ములుగు మండలంలో ఇంటింటి సర్వే శుక్రవారం ప్రారంభించారు. ఈ మేరకు సర్వేను జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, ఎంపీడీఓ రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 150 మందికి ఒక ఎన్యుమరేటర్ సర్వే చేయనున్నట్లు తెలిపారు. సర్వేకు ప్రజలు సహకరించాలని అన్నారు. సర్వేలో తప్పనిసరిగా ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల మేరకు కొనసాగించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

గోవిందరావుపేట: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో శుక్రవారం ప్రభుత్వ అధికారుల ఆధ్వర్యంలో కుల గణన సర్వే ప్రారంభమైంది. సర్వేను తహసీల్దార్ సృజన్ కుమార్, ఎంపీడీఓ జవహర్ రెడ్డి ప్రారంభించారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్ జి మండలంలోని పస్రా గ్రామంలో చేపట్టిన కుల గణన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ఇంటి నంబర్లు నమోదు చేసుకుని స్టిక్కర్లు అంటిస్తున్నామన్నారు. అనంతరం అధికారులు ఇంటికి వచ్చి కుటుంబ సభ్యుల వివరాలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఏలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏటూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇంటింటా కుటుంబ సర్వే చేపట్టినట్లు తహసీల్దార్ జగదీశ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓడవాడలో కుటుంబ సర్వేను జగదీశ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా ముందస్తుగా కుటుంబాలు ఎన్ని ఉన్నాయని ఉద్దేశ్యంతో ఈ సర్వేను చేపట్టినట్లు తెలిపారు. ఈనెల 6 నుంచి సమగ్ర ఇంటింటి సర్వే ఉంటుందని వెల్లడించారు. ప్రతి ఇంటి వద్ద సమాచారం ఇచ్చేందుకు ఒకరు తప్పకుండా ఉండాలన్నారు. పది మంది ఎన్యుమేటర్స్‌కు ఒక సూపర్‌వైజర్ ఉంటారని, సర్వే చేసిన ఇంటికి కోడ్ నంబర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సమాచారంలో ఎలాంటి లోటు పాటు లేకుండా ఎన్యుమేటర్స్‌కు పూర్తిగా అవగాహన కల్పించినట్లు ఆయన వివరించారు. ఏటూరునాగారం గ్రామంలో 3362 ఇళ్లు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ భానుప్రకాష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వీఆర్ఏ శంకర్, అంగన్‌వాడీ టీచర్ లలిత, సిబ్బంది పాల్గొన్నారు.



గోవిందరావుటపేట: కులగణన సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

ప్రతీ ఇంటికి స్టిక్కర్ పడాలి

వాజేడు: ప్రతీ ఇంటికి స్టిక్కర్ వేయాలని ఒక్క ఇళ్లు కూడా తప్పి పోవద్దని మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్ అన్నారు. ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా శుక్రవారం మండల వ్యాప్తంగా స్టిక్కర్లను వేశారు. 17 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన స్టిక్కరింగ్ వేసే కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి సర్దార్‌సింగ్, అధికారులు దగ్గర ఉండి పరిశీలించారు.

మంగపేటలో..

మంగపేట: మండలంలో ప్రారంభమైన హౌస్‌లిస్టింగ్ సర్వేను అదనపు కలెక్టర్ సంపత్‌రావు (రెవెన్యూ) శుక్రవారం పరిశీలించారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో హౌస్ లిస్టింగ్ సర్వేను శుక్రవారం ఎంపీడీఓ బద్రు పర్యవేక్షణలో ప్రారంభమైంది. సర్వే జరుగుతున్న తీరుపు అదనపు కలెక్టర్ తిమ్మంపేట, చెరుపల్లి, కమలాపురంలో పరిశీలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

వెంకటాపురం(ఎం) : మండల కేంద్రంలోని మైనార్టీ జూనియర్ కళాశాలకు చెందిన కొండా వర్షిని, వేద, అశ్విత హాకీ క్రీడలో, ఎండీ. సనా బ్యాడ్మింటన్‌లో, యాస్మినా హ్యాండ్‌బాల్, ఇర్ఫానా షటిల్, జేష్టిత, సన్విత క్రికెట్, సమీనా, అప్స ఫుట్‌బాల్, రీష్మా పరుగుపందెం పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ వందన తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో ప్రిన్సిపాల్ వందనతో పాటు పీడీ నవ్య విద్యార్థులను అభినందించారు.